
## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్ వస్తే వ్యవసాయం ఖతమే

ఆ పార్టీ నాయకులకు అధికార యావే తప్ప.. విజన్‌లేదీ

3 గంటల కరెంటు చాలట.. 10హెచ్‌పీ మోటర్లట



- రైతులు, కౌలుదారులకు మధ్య కొత్త కుంపటికి కుట్రలు
- ఫలితంగా వ్యవసాయ రంగంపై నీలినీడలు
- కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

**రైతుబంధు దుబారా అంటున్నరు.. ధరణి అసలే వద్దట**

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో వ్యవసాయంపైన, రైతుల మీద కాంగ్రెస్ పగబట్టినట్లు కనిపిస్తున్నది. కాంగ్రెస్ అగ్రనేతలు చేస్తున్న ప్రకటనలన్నీ ఆగమాగంగానే ఉన్నాయి. తమ పాలన నాటి పరిస్థితులకు వ్యవసాయాన్ని దిగజార్చడమే తమ ధ్యేయమన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో వ్యవహరిస్తూ వచ్చింది. ప్రాజెక్టుల ద్వారా సాగునీరు వస్తే.. ఆ నీటిని తోడుకునేందుకు ఇస్తున్న 24 గంటల కరెంటుపై ఆ పార్టీ కుట్రలు ఒక్కొక్కటిగా బయటకు వస్తూనే ఉన్నాయి. 24గంటలు వద్దు.. 3 గంటల కరెంటు ముద్దంటూ ఒకటికి రెండుసార్లు ఢంకా బజాయించి చెప్తున్నారు. అదెట్లా అని రైతులు నిలదీస్తే 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని సలహాలిస్తున్నారు. ఇక నిశ్చింతగా రైతుబంధు డబ్బు రైతుల ఖాతాల్లో జమ అవుతుంటే అది కాంగ్రెస్ నాయకులకు దుబారాగా కనిపిస్తున్నది. పైగా వాళ్లు వస్తే ఇస్తామంటున్న రైతు భరోసా రైతులకు, కౌలుదారులకు మధ్య చిచ్చుపెట్టేలా ఉన్నది. ధరణిని భూమాతగా మార్చేస్తామంటూ.. అందులో రైతు భూమిపై కౌలుదారులకు, ఇనాందారులకు ఇలా ఇంకా ఎవరెవరికో చట్ట ప్రకారం హక్కులు కల్పిస్తామంటూ కొత్త చిక్కులకు తెరలేపారు. ఇలాంటివెన్నో గందరగోళ చర్యలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుండడంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. స్వరాష్ట్రంలో భారీగా పెరిగిన భూముల విలువకు ఎసరు పెట్టేలా.. పెరిగిన సాగు విస్తీర్ణాన్ని మళ్లీ కుచించుకుపోయేలా.. గ్రామాల్లో పచ్చని భూముల్లో చిచ్చురేపేలా.. ఫైనల్‌గా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తూ పల్లె జనం పట్నం వలసబాట పట్టేలా కాంగెస్ పార్టీ ప్రకటనలు రైతుల కడుపు మండిస్తున్నాయి. సమైక్య రాష్ట్రంలో ఎన్నో సార్లు నమ్మి ఆగమై గోసపడ్డ రైతన్నలకు ఆనాటి కాంగ్రెస్ పాలన మదిలో మెదులుతుండగా.. మళ్లోసారి కేసీఆర్‌కే జైకొట్టేందుకు సిద్ధమయ్యారు.

సమైక్య పాలనలో వెనుకబడిన జిల్లాగా ముద్రపడిన ఉమ్మడి నల్లగొండ నేడు వ్యవసాయంలోనే అగ్రగామిగా నిలుస్తున్నది. అటూ ఇటూ కృష్ణా, గోదావరి జలాలకు తోడు మధ్యలో మూసీ పరవళ్లు ఉమ్మడి జిల్లాను రాష్ట్రానికే అన్నపూర్ణగా మార్చేశాయి. నాడు 4నుంచి 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండితే.. నేడు 34లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే అత్యధిక ధాన్యం పండిస్తున్న జిల్లాగా అవతరించింది. దీనంతటికీ ఆనాటి ఉద్యమ నేత, నేటి ప్రజా పాలకుడు కేసీఆర్ విజనే కారణమన్నది కాదనలేని సత్యం. బోరు బావులపై ఆధార పడి రాష్ట్రంలోనే అత్యధిక వ్యవసాయ కనెక్షన్లు ఉన్న జిల్లా నల్లగొండనే. అలాంటి నల్లగొండ రైతన్నకు ముఖ్యమంత్రి ఇచ్చిన 24గంటల ఉచిత కరెంటు ఆయువుపట్టుగా మారింది. ఇక సాగర్ నుంచి కృష్ణా జలాలు, కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు జిల్లాకు తరలిరావడంతో సిరుల పంటకు వేదికైంది. ఉమ్మడి జిల్లాలో వరి సాగు 4.44 లక్షల ఎకరాల నుంచి 13.54 లక్షల ఎకరాలకు పెరిగింది. దీంతో ధాన్యం ఉత్పత్తిలోనూ సరి కొత్త రికార్డును సృష్టించింది. ఇక పత్తి పంట సైతం 8లక్షల ఎకరాలకు విస్తరించింది. ఇలా ఏ పంటను చూసినా నల్లగొండ జిల్లా రైతన్న ఆదర్శంగా నిలుస్తున్నాడు. దీనంతటికీ కారణం.. కేసీఆర్ ఇస్తున్న 24గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, ధరణి ద్వారా రైతులకు సర్వ హక్కులు ఇలా ఎన్నో రైతు సంక్షేమ కార్యక్రమాలే. ఇలాంటి కార్యక్రమాలతో రైతులంతా కేసీఆర్‌ను తమ పెద్దన్నగా భావిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇలాంటి పరిస్థితులన్నీ సహజంగా కాంగ్రెస్ అగ్రనేతలకు జీర్ణం కావడం లేదు. అందుకే ఎన్నికల ప్రచారం వేదికగా ఎన్నో కుట్రలకు తెరలేపుతూ రైతుల్లో తీవ్ర గందరగోళాన్ని కలిగిస్తున్నారు.

### వాళ్ల మాటలు ఆచరణలోకి వస్తే..

కాంగ్రెస్ అగ్రనేతలు చేస్తున్న ప్రకటనలు ఆచరణలోకి వస్తే వ్యవసాయం ఆగమాగమై రైతన్న ఖతం అవుతాడన్న చర్చ సర్వత్రా సాగుతున్నది. 24 గంటల స్థానంలో 3 గంటల కరెంటు చాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన సాగుపై తీవ్ర ప్రభావం చూపనుంది. దాంతో సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతోపాటు దిగుబడి పూర్తిగా పడిపోనుంది. పైగా రైతుల్లో మానసిక అశాంతి మొదలై కంటిమీద కునుకు లేని పరిస్థితులు తథ్యం. దీంతో వ్యవసాయంపై విరక్తికి ఆస్కారం ఉంది. రైతుబంధు దుబారా అంటూ చేస్తున్న ప్రకటనలు కూడా రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు సీజన్ వస్తుందంటే పెట్టుబడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులు ఉత్సాహంతో సాగుకు సిద్ధమయ్యేవారు. కానీ.. రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ పూటకో తీరుగా మాట్లాడుతుండడం ఇబ్బందిగా మారింది. ఒకరు దుబారా అంటారు.. మరొకరు రైతులతోపాటు కౌలుదారులకు కూడా ఇస్తామంటున్నారు. ఇద్దరికీ ఎలా ఇస్తారంటే ఎవరికో ఒకరికే ఇస్తాం.. అది కూడా గ్రామసభ పెట్టి తేలుస్తామంటూ రేవంత్‌రెడ్డి చెబుతుండడం కలవరానికి గురిచేస్తుంది. ఇక ధరణితో భూ యజమానులు నిశ్చింతగా ఉన్నారు. తమ భూమిపై సర్వహక్కులు వాళ్లకే కట్టబెట్టడంతో భూముల విలువ కోట్లకు చేరినా ఇబ్బంది లేకుండా పోయింది. కానీ.. కాంగ్రెస్ నేతలు భూమాత అంటూ కౌలుదారులకు, ఇనాందారులకు తిరిగి హక్కులు కల్పిస్తామంటూ ప్రకటన చేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం భూముల విలువలు లక్షల్లో పలుకుతున్న తరుణంలో ఇలాంటి చర్యలు కాంగ్రెస్‌కు తగదన్న చర్చ నడుస్తున్నది. వీటన్నింటి ఫలితంగా భూముల రేట్లు తగ్గడంతోపాటు సాగు విస్తీర్ణం కూడా పడిపోతుందన్న చర్చ మొదలైంది. ఇదే జరిగితే గ్రామాల్లో మళ్లీ ఉపాధి సమస్య తలెత్తి రైతులతోపాటు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు కూడా వలసబాట పట్టక తప్పదన్న ఆందోళన వ్యక్తం అవుతున్నది. అందుకే వినాశకర కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తామంటూ రైతన్నలు ఒక్కటవుతున్నారు. వ్యవసాయాన్ని ఖతం చేసే కుట్రలకు తెరలేపుతున్న కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో తామే ఖతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. వ్యవసాయం అంటే తెల్వని, దానిపై ఓ విజన్ అంటూ లేని కాంగ్రెస్ పార్టీ తమకు అవసరం లేదని రైతులు ఢంకా బజాయించి చెప్తున్నారు.

### భూములు అన్యాక్రాంతం అవుతయ్



తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం కేసీఆర్‌తోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీళ్లు, కరెంటు కోసం కొట్లాడినం. మళ్లీ ఇప్పుడు మర్చిపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే పెత్తనం ఆంధ్రోళ్ల చేతిలోకి వెళ్తుంది. సాధించికున్న తెలంగాణ చేతి నుంచి జారిపోతది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 ఎకరాల కరెంటు చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. సీఎం కేసీఆర్ నేతృత్వంలో 24 గంటల కరెంటుతోపాటు మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించారు. దాంతో భూగర్భజలాలు పెరిగి పంటలు పుష్కలంగా పండుతున్నాయి. దేశంలోనే అత్యధికంగా వరిధాన్యం పండేంచేది తెలంగాణే. పండిన పంటను ప్రభుత్వమే కొంటుంది. అలాంటప్పుడు రైతులు కాంగ్రెస్ వైపు ఎందుకు ఆలోచిస్తరు. ధరణిని తీసేసి భూమాత తెస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నరంటే మళ్లీ దిక్కుమాలిన పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొద్దామనే. ధరణి తీసేస్తే భూములు అన్యాక్రాంతం అవుతాయి. భూముల ధరలు తగ్గిపోతాయి. కౌలుదారు చట్టంతో రైతుల మధ్య పంచాయితీలు జరుగుతాయి. కాంగ్రెస్‌తో తెలంగాణ రైతాంగం భవిష్యత్ ప్రశ్నార్థకమైతది. సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకొని వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేద్దాం.

**–సామ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు, నకిరేకల్**

### కాంగ్రెస్ మాటలు వింటే భూముల విలువ పడిపోతది



రైతుబంధును కౌలు రైతులు, రైతుల్లో ఎవరికో ఒకరికే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. దాంతో రైతులు, కౌలు రైతుల మధ్య కొట్లాటలు జరుగుతాయి. శాంతిభద్రతల సమస్యలు ఏర్పడతాయి. భూముల విలువ కూడా తగ్గిపోతుంది. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3 గంటల కరెంటే సరిపోతుందని చెప్పడం విడ్డూరంగా ఉంది. వారి మాటలు నమ్మితే రైతులు వ్యవసాయం చేయలేరు. సీఎం కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగునీరు, విద్యుత్‌తోపాటు రైతుబంధు ఇస్తుండడంతో భూములకు విలువ పెరిగి రైతులు భరోసాతో బతుకుతున్నారు. ధరణి ఎత్తేస్తామని, సీఎం కేసీఆర్ ప్రజల సొమ్ము వృథా చేస్తున్నాడని మాట్లాడడం కరెక్ట్ కాదు. వ్యవసాయం పండుగలా సాగేందుకు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలువాలి.

**–వట్టి నర్సిరెడ్డి, ఆదర్శ రైతు, జువ్విగూడెం, నార్కట్‌పల్లి**

### వలసలు పెరుగుతయ్



కాంగ్రెసోళ్లు చెబుతున్న 3 గంటల కరెంటుతో రైతులు వ్యవసాయం చేయడం మానేసే పరిస్థితి వస్తది. భూములన్నీ పడావు పడడంతోపాటు ధరలు తగ్గుతాయి. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక ఉపాధి కరువై ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం ఖాయం. వలసలు వెళ్లడంతో గ్రామాల్లోని భూములన్నీ కబ్జాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతది. రైతులు ఇంటి పట్టున ఉండి వ్యవసాయం చేసుకోవడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేదు. కరెంటు కష్టాలతో ఎన్నో ఎండ్లుగా ఇబ్బందులు పడ్డాం. సాగు చేసుకోవాడానికి భూములున్నా కరెంటు, సాగునీరు లేక బీడు పడతాయి. తెలంగాణ సర్కారు రైతులకు 24 గంటల కరెంటు ఇస్తుండడంతో రెండు పంటలు పండించుకొని సంతోషంగా ఉంటున్నాం. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు కష్టాలు మొదలయినట్లే.

**–చిట్యాల రాజిరెడ్డి, నారెగూడెం, రైతు సంఘం మండలాధ్య క్షుడు, కట్టంగూర్**

### కాంగ్రెస్ వస్తే భూముల విలువలు పడిపోతాయి



ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో సరిపడా సాగునీరు, 24 గంటల నాణ్యమైన కరెంటు, రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం ఇవ్వడం వల్ల పంటలు పుష్కలంగా పండుతున్నాయి. దీని కారణంగా భూముల విలువలు అమాంతం పెరిగి చిన్న రైతులు సైతం ధీమాగా బతుకుతున్నరు. అయితే.. ధరణి ఎత్తివేస్తామని, సాగుకు మూడు గంటలే కరెంటు ఇస్తామని, రైతుబంధు దండుగ అని, కేసీఆర్ డబ్బులు వృథా చేస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు తలోమాట మాట్లాడుతున్నారు. రైతు బంధు పెట్టుబడి సాయం భూ యజమానికైనా, కౌలు రైతుకైనా ఒకరికే ఇస్తామని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. దీని వల్ల రైతులకు, కౌలుదారులకు మధ్య గొడవలు జరిగి శాంతిభద్రతల సమస్య తలెత్తుతుంది. కరెంటు మూడు గంటలే ఇస్తామనడం విడ్డూరంగా ఉన్నది. కాంగ్రెస్ నాయకులను నమ్మితే రైతులు వ్యవసాయం చేయలేరు. రైతులు, కౌలుదారులకు మధ్య వివాదాలు వస్తాయి. రైతుల భూముల విలువలు బాగా తగ్గిపోతాయి. దీని వల్ల నష్టపోయేది రైతులే. రైతు సంక్షేమ పథకాలను ఎత్తివేస్తానన్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలె. లేకుంటే రైతులు ఆగంకాక తప్పదు.

**– తూడి లక్ష్మారెడ్డి, రైతు, ఊట్లపల్లి, మిర్యాలగూడ మండలం**